క్లుప్తంగా

వైభవంగా నెలపూజ




పూజలందుకుంటున్న చింతలాముని, నల్లారెడ్డి స్వామివారు

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెలపూజ గురువారం వైభవంగా జరిగింది. నెలపూజ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ గ్రామల నుంచి మేళతాళలతో భక్తులు ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ఆకుపూజ, తులసిపూజ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారిని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. గోనెగండ్లతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం



ఆలూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. గురువారం ఆలూరు–4 సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యారోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని వైద్యులు సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 136 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్లు తెలిపారు. సచివాలయ, 104 సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మినారాయణ

చిప్పగిరి: ఓటరు జాబితా సవరణలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దారు లక్ష్మినారాయణ కోరారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5, తేదీల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు ఆయా గ్రామాల్లో ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం మండలంలోని నాగలదిన్నెలోని రాఘవేంద్ర సర్కిల్ వద్ద కనకవీడు గ్రామానికి చెందిన మాల గోవిందు అక్రమంగా కర్ణాటక మద్యాన్ని సంచిలో తరలిస్తుండగా పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కర్ణాటక మద్యం జాన్స్ ఒరినల్ ఛాయస్ విస్కీ 384 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది మల్లికార్జున, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వైద్యులనే గ్రామాలకు పంపి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టిందన్నారు. అత్యవసర చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, ఏఎన్‌ఎం గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు
- అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



తొగర్చేడులో ఆర్బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



నూతనంగా ప్రారంభించిన కార్యాలయాల వద్ద ఎమ్మెల్యే, తదితరులు

కృష్ణగిరి: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో సాకారమైందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో రూ.83 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ఆమె ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, వైస్ ఎంపీపీ బోయ సుశీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పత్తికొండలో ఈ నాలుగున్నర ఏళ్లలో అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకులు అనడం విడ్డురంగా ఉందన్నారు. గ్రామాల్లోకి వెళితే దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు దర్శనమిస్తున్నాయని, వాటి ద్వారా అందిస్తున్న సేవలే అభివృద్ధికి నిదర్శమన్నారు. తొగర్చేడులో మూడు కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు గ్రామంలోనే అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేసి పరిపాలన గ్రామస్థాయికి తీసుకొచ్చిన ఏకైక సీఎం జగనన్న ఒక్కడే అన్నారు. రాజన్న స్వర్ణయుగంలో వ్యవసాయాన్ని పండగ చేయగా ఆయన బాటలో తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నాడన్నారు. అప్పట్లో ఆయన ఉచిత విద్యుత్‌తో రైతుల గుండెల్లో నిలవగా ఇప్పుడు సీఎం జగనన్న వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా పంటలసాగుకు పెట్టుబడి సాయం అందిస్తూ రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. అలాగే గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు విత్తనం నుంచి దిగుబడులను మద్దతు ధరతో అమ్ముకునే వరకు అన్ని దశల్లో సహకారం అందిస్తున్నారని వివరించారు. మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీఓ విశ్వమోహన్, ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ శేషయ్య, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, వైద్యాధికారి ప్రదీప్, నాయకులు లాయర్ మహేశ్వరరెడ్డి, దస్తగిరి, రామచంద్రుడు, భీమిరెడ్డి, నవీనపాటి, రంగనాయకులు, జయరామిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్క రైతును ఆదుకుంటాం

కృష్ణగిరి: ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి తీవ్ర వర్షాభావం వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం సాయం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో గురువారం ఆమె మండల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పేద ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలన్నీ మూడేళ్లలోనే అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన జాబితాలో కృష్ణగిరి మండలం మధ్యస్థ జాబితాలో ఉండటం, తుగ్గలి మండలం జాబితాలో లేకపోవడంతో ఇక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ రెండు మండలాల్లోని రైతులను ఆదుకునేలా వ్యవసాయ శాఖ మంత్రి కాకాగి గోవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులు అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేశ సుభాషిణి, స్థానిక నాయకులు ఉన్నారు

స్నేహపూర్వకంగా మెలగాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: గ్రామాల్లో అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని డీఎస్పీ సీతారామయ్య గ్రామస్తులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని పోనకలదిన్నెలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పికెట్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత పల్లెల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గొడవలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామంలో అందరూ ప్రశాతంగా జీవించాలన్నారు. ఎస్‌ఐ తిమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

తుగ్గలి: మత్తుకు బానిసగా మారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీహెచ్‌ఓ అన్నపూర్ణ సూచించారు. టొబాకో, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసైతే సర్వం కోల్పోతారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఏఎస్‌ఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

గోనెగండ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం, వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం గోనెగండ్ల 3, 4వ వార్డులు, సాయంత్రం ఒంటెడుదిన్నె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలును వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్ మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య జీలజీవన్ మిషన్ పథకంతో తీరుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇప్పటి వరకూ రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లోనూ అండగా నిలవాలని కోరారు. ఈఓఆర్డీ నాగేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కన్వీనర్ దొరబాబు, ఒంటెడుదిన్నె సర్పంచ్ కేశవ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ విశ్వమోహన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో 30 కి.మీ మేర హంద్రీ–నీవా కాలువ ప్రవహిస్తుండడంతో వేల ఎకరాల భూమి సాగులోకి వచ్చిందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గత పాలకులు మండల అభివృద్ధి పూర్తిగా విస్మరించారని, వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందన్నారు. అందరి సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సభ దృష్టికి వచ్చిన బోయ బొంతిరాళ్ల గ్రామ తాగునీటి సమస్య పరిష్కారానికి, అలాగే మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని తీర్మానం చేసి అధికారులకు పంపుతామన్నారు. అలాగే కంబాలపాడు- కోయిలకొండ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణంతోపాటు బీటీ రహదారి, టి.గోకులపాడు వద్ద హంద్రీపై బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, వైస్ ఎంపీపీ సుశీల, అన్ని శాఖల అధికారులు, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆస్పరి: అందరూ కలసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం ఆస్పరిలో జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు ఆధ్వర్యంలో ఆస్పరి మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని సామాజికంగా, ఆర్థికంగా ఆదుకున్నాడన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఆదర్శంగా నిలిచాడన్నారు. గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేసి పార్టీ నాయకులు పల్లెల్లో నిద్ర చేయాలన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాంభీంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, ఆస్పరి, ఆలూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పెద్దయ్య, వీరేష్, నాయకులు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్

ఆస్పరి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ప్రొఫెసర్ రాజశేఖర్ సూచించారు. ఆస్పరికి చెందిన రాజశేఖర్ బెంగళూరులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన నాలుగేళ్లుగా మండలంలో చదువలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2021–22, 2022–23లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆయన గురువారం తల్లిదండ్రులు దుర్గం ఈరమ్మ, కుమారప్ప జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రేష్మకు రూ.5 వేలు, మల్లేశ్వరికి రూ.5 వేలు, కృష్ణ, రాము, యూనస్, వైష్ణవిలకు రూ.3 వేలు చొప్పున చెక్కులు, ప్రశంసా పత్రం, మొమెంటోలను అందజేశారు.

న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు



పత్తికొండలో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

పత్తికొండ రూరల్: ఏపీ బార్ కౌన్సిల్ అనాలోచితంగా పెంచిన రూ.20 వెల్ఫేర్ స్టాంపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం పత్తికొండ న్యాయవాద బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణయ్య అధ్యక్షతన జరిగిన దీక్షలనుద్దేశించి సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు మాట్లాడారు. ఇప్పటికే రూ.100 వెల్ఫేర్ స్టాంపు ఉందని అదనంగా రూ.20 స్టాంపు తీసుకురావడం వల్ల కక్షిదారులపై అదనపు భారం పడుతుందన్నారు. వెంటనే పునరాలోచించి రూ.20 స్టాంపును రద్దు చేయాలని కోరారు. న్యాయవాదులు రంగస్వామి, సురేంద్రకుమార్, ప్రసాద్‌బాబు, సుధాక్రిష్ణ తదితరులు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాదులు సురేష్‌కుమార్, చంద్రశేఖర్‌నాయుడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి



ఆస్పరి కేజీబీవీలో విద్యార్థినికి ఐరన్ మాత్రలు వేస్తున్న దృశ్యం

ఆస్పరి: భోజనం చేసే ముందు ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక ఆస్పరి కేజీబీవీలో నిర్వహిస్తున్న విప్స్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేసి వాటి గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండాలని సూచించారు. డాక్టర్ రఘురామిరెడ్డి, సీహెచ్‌ఓ రాజేశ్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

దేవనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో జరిగే స్పందన-జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పక్కా ప్రణాళికతో పట్టణాభివృద్ధి



ఎమ్మిగనూరు 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజల అవసరాలకనుగుణంగా పలు వార్డుల పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 7, 9వ వార్డుల్లో రూ.21 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు రాజారత్నం, సూర్యనారాయణలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి అన్ని వార్డుల్లోనూ దశల వారీగా మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. శివారు ప్రాంతాల్లో సైతం రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ ఏఈ మదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, యుకె రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గట్టుభాజ, రజాక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పట్టణంలోని వెంకటాపురం కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలిన చిన్న ఈరన్న కుటుంబానికి గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు కౌన్సిలర్ బజారి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తిలో వెలసిన శేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి అక్కడే నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాత దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సారా విక్రేత అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున గ్రామ శివారులోని హైస్కూల్ పక్కన కంప చెట్ల వద్ద నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో గురువారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఇతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా సారా తయారు చేసినా, అమ్మినా తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళపై దాడి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గాజ సుమిత్ర గేదె వెంకటేశ్వర్లు పొలంలోకి వెళ్లడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. ఆయన గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో పీఆర్ ఏఈ జయన్న ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

కృష్ణగిరి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచామని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో గురువారం రాత్రి ఆయన కృష్ణగిరి ఎస్‌ఐ సురేష్‌తో కలిసి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ గ్రామాల్లోని ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సమస్యలు వచ్చినప్పుడు నిర్భయంగా వచ్చి స్టేషన్‌లో చెప్పుకోవచ్చన్నారు. ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



జీఈ వీరేష్‌గౌడ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన జీఈ వీరేష్ గౌడ్ (48) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్లోని ఓ ప్రైవేట్ హస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. పట్టణానికి చెందిన జీఈ వీరేష్‌గౌడ్ గత నెల 25వ తేదీ రాత్రి కోసిగి రోడ్డులోని కల్లు డిపో నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తూ వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డు దాటుతుండగా మంత్రాలయం వైపు నుంచి వచ్చిన కర్ణాటక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో ఓ ప్రైవేట్ హస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వ్యక్తిపై దాడి

నందవరం: పొలంలో నిలిచిన వర్షపు నీరు కిందకు వెళ్లేందుకు సహకరించాలని కోరిన మాల శేఖర్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు.. గ్రామంలో మాల శేఖర్, బోయ బొజ్జన్న పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే శేఖర్ పొలం పైన ఉండడంతో వర్షపు నీరు బొజ్జన్న పొలంలోకి పారుతుండేది. ఈ ఏడాది వర్షపు నీరు కిందకు పారకుండా బొజ్జప్ప కుమారులు బోయ రామాంజిని, ఉరుకుందు, నరసింహులు అడుకట్ట వేశారు. దీంతో ఈ రోజు గ్రామ పెద్దల వద్ద పంచాయతీకి పిలిచి వర్షపు నీరు కిందకు ప్రవహించాలని చెప్పిన మాల శేఖర్‌పై బోయ రామాంజిని, ఉరుకుందు, నరసింహులు, బొజ్జన్న దాడి చేసి గాయపరిచారు. కులం పేరుతో దుషించి తీవ్రంగా గాయ పరిచారు. ప్రస్తుతం మాల శేఖర్ ఎమ్మిగనూరు ఆసుపత్రికిలో చికిత్స పొందుతున్నాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



మొలగవెల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీవ్రవని ఏపీడీ పక్కీరప్ప హెచ్చరించారు. ఆయన గురువారం ఆలూరు మండలంలోని మొలగవెల్లి, కురువెల్లి, పెద్దహోతూరు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి పనులు కావాలని అడిగిన వారికి వెంటనే జాబ్‌కార్డులను మంజూరు చేసి పనులను కల్పించేంలా చర్యలు తీసుకోవాలని సీనియర్ మేట్లు, ఎఫ్ఏలు, టీసీ, ఈసీలను ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ఎఫ్ఏలు, సీనియర్లు మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు వెంట ఉన్నారు.

పేదల దేవుడు సీఎం వైఎస్ జగన్



ఈ ఫొటోలోని వృద్ధురాలు పేరు లక్ష్మిదేవమ్మ. ఆలూరుకు చెందిన ఈమెకు పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. ఉన్న వారు కూడా సరిగా చూసుకోవడం లేదు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినెలా 1వ తేదీన తెల్లవారకముందే పింఛన్ సొమ్ము అందిస్తుండడంతో తిండికి, మందులకు ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి జగన్ తమలాంటోళ్ల ఆరోగ్యం, బాగోగుల గురించి పథకాలు అమలుచేస్తూ కన్న కుమారుడి కంటే ఎక్కువగా చూసుకుంటున్నారని సంతోషంగా చెబుతోంది.

మురిపించిన కానుక



మల్కాపురంలో వడ్ల లక్ష్మమ్మ, ఈరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కళ్యాణ్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు చేపట్టారు. వృద్ధులు, లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకొని వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్లు ఇళ్ల దగ్గరకే వచ్చి పింఛన్లు అందిస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు. పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు.

తుగ్గలి: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మండల వ్యాప్తంగా రెండో రోజు కొనసాగింది. గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి 90.17 శాతం మందికి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 7,775 మందికి నగదు పంపిణీ చేయాల్సి ఉండగా 7,011 మందికి పెన్షన్ సొమ్ము అందించారు. రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు.